

సేవారత్న పురస్కారం

అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక సేవాకర్త ఖానాపురం గ్రామ మాజీ సర్పంచ్ నర్సింహను సేవారత్న అవార్డుతో సత్కరించింది.

– మణికొండ, జనవరి 28

## సామాజిక న్యాయం పాటించాలి

హిమాయత్‌నగర్, జనవరి 28: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు లో త్వరలో ప్రకటించే నియామకాలో సామాజిక న్యాయం పాటించాలని ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఫోరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్లీడర్,అసిస్టెంట్ ప్లీడర్,ప్రభుత్వ శాఖల స్టాండింగ్ కౌన్సిల్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవుల భర్తీకి చేపట్టబోయే నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ న్యాయవాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## నేడు ఖైరతాబాద్ నియోజకవర్గం

### బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

బంజారాహిల్స్,జనవరి 28: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులను సన్నద్ధం చేసేందుకు ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని లేక్‌వ్యూ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు,ముఖ్యనాయకులు, డివిజన్ కమిటీలు, వివిధ విభాగాలకు చెందిన కమిటీ సభ్యులు,మహిళా కమిటీల సభ్యులతో పాటు బూత్ కమిటీ సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు.

# పరిధి తగ్గినా.. పెరుగుతున్న కేసులు


**నెలరోజుల్లోనే 100కి పైగా కేసులు**

- మూడు పీఎస్‌లలో 100కు పైగా ఎఫ్ఐఆర్‌ల నమోదు
- వెస్ట్‌జోన్ పరిధిలో భారీగా పెరుగుతున్న కేసుల సంఖ్య
- లబోదిబో మంటున్న బాధితులు, నిందితులు

బంజారాహిల్స్,జనవరి 28: వెస్ట్‌జోన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. జనవరి నెలలో ఇప్పటికే వెస్ట్‌జోన్ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌ల సంఖ్య 100 దాటడం చర్చనీయాంశంగా మారింది. బంజారాహిల్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే 100 కేసులకు పైగా నమోదు కాగా సంజీవ్‌రెడ్డినగర్ పీఎస్‌లో సుమారు 95కు పైగా కేసులు నమోదయ్యాయి. గతంలో అతిపెద్ద పోలీస్‌స్టేషన్లుగా ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట పీఎస్‌లలో ఏడాదికి 750 నుంచి 1150 వరకు కేసులు నమోదయ్యేవి. దాంతో కేసుల విచారణలో జాప్యం జరిగేది. నెలవారీగా కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసుల రేషియోను తగ్గించేందుకు ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకొచ్చేవారు. అయితే పరిమితికి మించి కేసులు నమోదు కావడంతో పాటు బందోబస్తులు, పండుగల కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్ల కోసం ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది సమయాన్ని వెచ్చించాల్సి రావడంతో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించే లక్ష్యంతో ఆయా పీఎస్‌లలోని కొన్ని ప్రాంతాలను తీసి కొత్తగా ఫిలింనగర్, మాసాబ్‌ట్యాంక్, మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో పీఎస్‌లో ఉన్న సిబ్బంది, పరిధిని దృష్టిలో ఉంచుకుని ఏడాదికి 350నుంచి 450 కేసులు నమోదైతేనే సరైన రీతిలో దర్యాప్తు జరగడంతో పాటు కన్విక్షన్ రేటును పెంచేందుకు వీలువుతుందనే ఉద్దేశంలో కొత్త పీఎస్‌లు ఏర్పాటు చేశారు. నెల రోజులుగా వెస్ట్‌జోన్ పరిధిలోని 5 పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతుండడంపై నమస్తే తెలంగాణ పత్రిక పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**చిన్నదైనా, పెద్దదైనా ఎఫ్ఐఆర్ చేసి తీరాల్సిందే..**

గతంలో ఎన్నడూ లేని విధంగా కేసుల సంఖ్య పెరిగిపోతుండానికి ఇటీవల ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలే కారణమని తెలుస్తోన్నది. గతంలో చిన్నచిన్న రోడ్డు ప్రమాదాలు జరిగితే ఫిర్యాదు దారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేయడంతో జీడీ ఎంట్రీ పెట్టి ప్రాథమిక విచారణ చేపట్టేవారు. ప్రమాదంలో వాహనాలకు జరిగే నష్టాన్ని తాము రిపేర్ చేయించి ఇస్తామని నిందితులు చెప్పడంతో చాలావరకు ఫిర్యాదు దారులు కేసులు వెనక్కి తీసుకునేవారు. అయితే ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా ఎంత చిన్న ప్రమాదమైనా ఎఫ్ఐఆర్ చేసి పారేస్తున్నారని, దాంతో తమకు రావాల్సిన నష్ట పరిహారం రాకపోగా కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో గత నెలరోజుల్లో నమోదైన కేసుల్లో 30శాతం కేసులు ఇలాంటి చిన్నకేసులే అని తెలుస్తోంది. దీంతో పాటు గతంలో బైక్ చోరీలు జరిగిందని ఫిర్యాదులు చేస్తే ప్రాథమికంగా విచారణ చేసి నాలుగైదు రోజులు ఆయా పోలీస్‌స్టేషన్లలో క్రైం సిబ్బంది వాటి ఆచూకీ కనుక్కొని అప్పగించేవారు. దీనివల్ల ఎఫ్ఐఆర్ చేసి విలువైన సమయాన్ని వృథా జరగకుండా చూసుకునేవారు. అయితే ఇప్పుడు బైక్ చోరీకి సంబంధించిన బాధితులు ఫిర్యాదులు చేసిన నిమిషాల్లోనే ఎఫ్ఐఆర్ చేతుల్లో పెడుతున్నారు. తీరా సాయంత్రానికి బైక్ దొరికినా దాన్ని విడిపించుకోవాలంటే కోర్టు ద్వారానే సాధ్యం అవుతుండడంతో ఫిర్యాదు దారులు లబోదిబోమంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ తదితర పోలీస్‌స్టేషన్లలో గత నెలరోజుల్లో సుమారు 30నుంచి 40దాకా బైక్‌లు మాయమవగా వాటిలో సగానికి సైగా రెండ్రోజుల్లోనే దొరికినా బాధితులకు అప్పగించలేని పరిస్థితి నెలకొంది.




## ఘనంగా మల్లన్నస్వామి జాతర

### ప్రత్యేక పూజలు నిర్వహించిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, సర్పంచ్ సతీష్‌యాదవ్ తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 28 : శంషాబాద్ మండలంలోని హమిదుల్లానగర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయంలో (జాతర) బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం పెద్దపట్నం అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. జాతర ఉత్సవాలలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ్‌రెడ్డి ప్రజలకు ఉచిత అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్,మంచర్ల మోహన్‌రావు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి

హిమాయత్‌నగర్,జనవరి 28: రాష్ట్రంలోని బీసీలు,కుల వృత్తుల అభివృద్ధి సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కుల గణన చేపట్టి కులాల వారీగా లెక్కలు తీసి వారి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు.బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు జరుపాలని కోరారు. అదేవిధంగా 50 ఏండ్లు నిండిన చేతి వృత్తుల వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



హమిదుల్లానగర్ గ్రామంలో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 28 : అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని హమిదుల్లానగర్ గ్రామంలో రూ. 7, 30 లక్షలతో బీసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ వట్టెల సతీష్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ దవణాకర్ గౌడ్,ఉప సర్పంచ్ మాధవియాదగిరి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో.. మౌలిక వసతులు కల్పించాలి

- పది వేల స్కూళ్లల్లో కంప్యూటర్లు అటకెక్కాయి
- మెగా డీఎస్సీ ప్రకటనకే పరిమితం కావద్దు
- డీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు యాదవ్




సమావేశంలో మాట్లాడుతున్న లింగమల్లు యాదవ్

ఖైరతాబాద్, జనవరి 28 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ధర్మ టీచర్స్ యూనియన్ (డీటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పాక లింగమల్లు యాదవ్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో వసతులు లేక డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఆడపిల్లలు పాఠశాలలకు రావడం లేదన్నారు. ఐటీ రంగం విస్తరిస్తుందని చెప్పుకుంటున్న తరుణంలో రాష్ట్రంలోని సుమారు పదివేల పాఠశాలల్లో కంప్యూటర్లు అటకెక్కాయన్నారు. ఇతర దేశాల్లో 12వ తరగతి స్థాయిలోనే సాంతికేక విద్య, వృత్తినైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారని, అలాంటి శిక్షణ తరగతులను ఇక్కడి విద్యార్థులకు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ప్రకటనకే పరిమితం కావద్దన్నారు. తమిళనాడులో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, అలాంటి పద్ధతిని ఇక్కడ తీసుకురావాలని, దాని పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. మల్టీజోనల్–2లో ఆగిపోయిన గెజిటెడ్ హెడ్మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలన్నారు. 'మన ఊరు– మన బడి' పథకంలో నిలిచిపోయిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ సలహాదారులు డాక్టర్ కొండా ఆశన్న, ప్రధాన కార్యదర్శులు డి. ఉపేందర్, కె. రాజు, బి. సుధాకర్, ఉపాధ్యక్షులు పి. అశోక్, ఎన్ రమేశ్, కోశాధికారి పి. జనార్దన్, కార్యదర్శులు హరికిషన్, శంకర్, అంజన్ బాబు, నాగయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రం నాగమణి



ఎర్రం నాగమణికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్

వెంగళరావునగర్, జనవరి 28:మత్స్యకారుల సంక్షేమం,అభ్యున్నతికి కృషి చేస్తానని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రం నాగమణి ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ఫిషరీస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా ఆమెకు నియామక పత్రాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రం నాగమణి ముదిరాజ్ మాట్లాడుతూ.. మత్స్యకారులు కష్టపడ్డా తగిన ప్రయోజనం ఉండటం లేదని..మత్స్యకారుల శ్రమను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య సంపదను పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

## మైనార్టీల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ ఖాద్రీ

ఖైరతాబాద్, జనవరి 28 : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ముస్లిమ్స్ కలెక్టివ్ ఫర్ జస్టిస్ సంస్థ ప్రతినిధి మేజర్ ఎస్ఎంజీ ఖాద్రీ ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ సభ్యులు ఖలీద్ రసూల్, సనావుల్లా ఖాన్‌తో కలిసి మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు, మైనార్టీ ఫైనాన్స్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీ, మైనార్టీ కమిషన్, తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌ను ప్రక్షాళన చేసి వారి సంక్షేమానికి పాటుపడాలన్నారు. పాత నగరాన్ని అభివృద్ధి చేయాలని, ఈ మార్గం గుండా మెట్రో రైలును నడపాలన్నారు. ఉస్మానియా దవాఖానలో బెడ్ల సంఖ్య పెంచాలని, మైనార్టీ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

## బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు అపహరణ

వెంగళరావునగర్, జనవరి 28:ఆర్టీసీ కండక్టర్ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.50 వేలు చోరీకి గురయ్యాయి. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం..జవహర్‌నగర్‌లో నివాసం ఉండే ఆర్టీసీ కండక్టర్ సీ.హెచ్. సాయిప్రసాద్(37)కు చెందిన ఎస్బీఐ అకౌంట్ నుంచి రూ.50 వేలు తమిళనాడు రాష్ట్రంలోని గంగిరాంప్టి ఏటీఎం నుంచి పలు విడుతలుగా డ్రా అయ్యాయి. తన అకౌంట్‌లో నుంచి నగదు తనకు తెలియకుండా డ్రా చేయడంతో బాధితుడు సాయిప్రసాద్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




**నిరసన:** బంజారాహిల్స్‌లోని లామాఖాన్‌లో ఆదివారం సిటిజన్స్ యాక్షన్ ఫర్ మణిపూర్ పేరిట ముగ్గులు వేసి ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

## బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను సాధించాలి




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, జగన్ నాయక్, బోనా నాయక్, జంగయ్య తదితరులు

ఖైరతాబాద్, జనవరి 28 : భారత మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని బాబూ జగ్జీవన్ రామ్ ఆల్ ఇండియా సమత మూవ్‌మెంట్ అధ్యక్షుడు సి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉపాధ్యక్షులు యు. జగన్ నాయక్, అధికార ప్రతినిధి ఆర్. బోనా నాయక్, లీగల్ సెల్ అధ్యక్షుడు జి. నరేశ్ కుమార్, జంగయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. జోజి, డి. సురేశ్, యశోద దేవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనాథ్

శంషాబాద్ రూరల్, జనవరి 28: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పెద్దషాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద గతంలో వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.... మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వారు ప్రవర్తన మార్చుకొని మరోసారి నేరాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పోలీసులు ఉన్నారు.

**సందర్శకులతో..సందడి:** సాగర్‌తీరాన హుస్సేన్‌సాగర్‌తో పాటు టక్కును గుర్తుకొచ్చేది సంజీవయ్యపార్కు. పార్కులో పచ్చని ఆహ్లాదంతో పాటు బొటానికల్ గార్డెన్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. దానిలో భాగంగా ఆదివారం పార్కు సందర్శకులతో కళకళలాడుతున్నది.





**పచ్చని హారం**

హిమాయత్‌నగర్‌లోని బీఆర్కే భవన్ రోడ్డు పచ్చని చెట్లతో స్వాగతం పలుకుతున్నట్లు ఉన్న దృశ్యం వాహనదారులు, పాదచారులను ఆకట్టుకుంటున్నది.

**పర్యాటకుల సందడి:**

ఆదివారం సెలవురోజు కావడంతో హుస్సేన్‌సాగర్ చుట్టుపక్కల పర్యాటకులతో సందడిగా మారింది. అంతే కాకుండా బోట్‌లో విహరిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు

